భూమి కోసం రైతుపై హత్యాయత్నం

- ఐదెకరాలపై తోటి రైతు కన్ను
- తుపాకీతో కాల్పులు.. గురి తప్పడంతో పరారీ
- నిందితుడి అరెస్ట్: పెద్దపల్లి ఏసీపీ

పెద్దపల్లి టౌన్, ఏప్రిల్ 14: తనది కాని భూమిని ఎలాగైనా దక్కించుకోవాలని ఓ రైతు కుట్ర చేశాడు. కొన్నేండ్ల పాటు గొడవలుపడి కోర్టుకెళ్లాడు. తీర్పు అనుకూలంగా రాకపోవడంతో సదరు రైతుపై తుపాకీతో హత్యకు యత్నించి గురి తప్పడంతో పరారయ్యాడు. చివరికి పోలీసులకు చిక్కి కటకటాలపాలయ్యాడు. ఈ ఘటన క్యాశ్రీరాంపూర్ మండలం పెద్దంపేటలో జరిగింది. ఆదివారం పెద్దపల్లి ఏసీపీ కార్యాలయంలో పెద్దపల్లి ఏసీపీ గజ్జికృష్ణ మీడియాకు వివరాలు వెల్లడించారు. కాల్వశ్రీరాంపూర్ మండలం ఉషన్నపల్లికి చెందిన ముస్కు మల్లారెడ్డికి పెద్దంపేట్ గ్రామ శివారు సర్వేనంబర్ 365లో ఐదెకరాల భూమి ఉంది. ఆ భూమి విషయంలో అదే గ్రామానికి చెందిన ముస్కు రామయ్య (57)కు మధ్య వివాదం జరుగుతున్నది. కోర్టు ముస్కు మల్లారెడ్డికి అనూకులంగా తీర్పు ఇవ్వడంతో రామయ్య జీర్ణించుకోలేకపోయాడు. మల్లారెడ్డిని హతమార్చితేనే భూమి సొంత మవుతుందని, కుటుంబసభ్యులు భయపడి భూమి వదులుకుంటారని భావించి హత్యకు ప్లాన్ చేశాడు. కొదురుపాక ఇటుక బట్టీలో పనిచేసినప్పుడు పరిచయమైన ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన వ్యక్తి సహకారంతో ఫిబ్రవరి 20న ఆగ్రాకు వెళ్లి రూ.30వేలతో తుపాకీ, 6బుల్లెట్లు కొన్నాడు. మార్చి 29న ఉదయం 11 గంటలకు మల్లారెడ్డి తన మక్క చేనులో నీళ్లు పెడుతుండగా రామయ్య వెళ్లి కాల్పులు జరిపాడు. అయితే.. తుపాకీ గురి తప్పడం, మల్లారెడ్డి గమనించి గట్టిగా కేకలు వేయడంతో రామయ్య పరారయ్యాడు. మల్లారెడ్డి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. నిందితుడి కోసం గాలించి ఆదివారం తన ఇంట్లోనే రామయ్యను అదుపులోకి తీసుకున్నారు.ఇంటి ఆవరణలో దాచిన తుపాకీతోపాటు నాలుగు బుల్లెట్లను స్వాధీనం చేసుకున్నట్టు ఏసీపీ తెలిపారు. ఈ సమావేశంలో సుల్తానాబాద్ సీఐ సుబ్బారెడ్డి, కాల్వశ్రీరాంపూర్, పెద్దపల్లి ఎస్సైలు లక్ష్మణరావు, మల్లేశ్, కానిస్టేబుల్స్ పాల్గొన్నారు.

నేడు బీజేపీ రైతు దీక్ష

- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి

హైదరాబాద్, ఏప్రిల్ 14 (నమస్తే తెలంగాణ) : రైతులపై కాంగ్రెస్ ప్రభుత్వ తీరుకు నిరసనగా సోమవారం 'రైతు దీక్ష' చేపట్టనున్నట్టు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తెలిపారు.ఆదివారం ఆయన బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. ఎన్నికల ప్రచారంలో రూ.2లక్షలు రుణమాఫీ చేస్తానని, కొత్తగా లోన్లు తీసుకోవాలని సీఎం రేవంత్ రెడ్డి రైతులను రెచ్చగొట్టారని చెప్పారు. ఇప్పుడు రుణమాఫీ అమలు చేయడం లేదని మండిపడ్డారు. వడ్డీలు పెరిగి రైతులపై భారం పడుతున్నదని, రైతులు ప్రైవేట్ వ్యక్తుల నుంచి కూడా అప్పులు తీసుకుంటున్నారని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఆరు గ్యారెంటీలను ఎప్పుడు అమలు చేస్తారని సీఎం రేవంత్‌రెడ్డిని ప్రశ్నించారు. కుంభకోణాలు చేసిన చరిత్ర కాంగ్రెస్ పార్టీదని విమర్శించారు. అలాంటి పార్టీ నేత సీఎం రేవంత్ రెడ్డి బీజేపీ మ్యానిఫెస్టోపై మాట్లాడటం విడ్డూరంగా ఉన్నదన్నారు. ఏపీ సీఎం జగన్‌పై రాయిదాడిపై స్పందిస్తూ.. ముఖ్యమంత్రిపై ఎవరు దాడి చేసినా మంచి సంప్రదాయం కాదని, దర్యాప్తు జరిపి, దోషులకు శిక్ష పడాలని కోరారు.

యాసంగి వడ్లకు చోటేది?

- గత యాసంగి, వానకాలం ధాన్యం ఇంకా మిల్లుల్లోనే
- సీఎంఆర్ ఆలస్యం, టెండర్ల ధాన్యం ఎత్తడంలో వైఫల్యం
- మిల్లుల్లోనే మూలుగుతున్న 80 లక్షల టన్నుల ధాన్యం
- పాత ధాన్యం తరలిస్తేనే కొత్త ధాన్యం దించుకొంటాం
- స్పష్టం చేస్తున్న మిల్లర్లు.. జిల్లాల కలెక్టర్లకు లేఖలు

దేవరకద్ర వ్యవసాయ మార్కెట్‌లో లోడింగ్‌కు సిద్ధంగా ఉన్న ధాన్యం బస్తాలు

హైదరాబాద్, ఏప్రిల్ 14 (నమస్తే తెలంగాణ): యాసంగి ధాన్యం కొనుగోళ్లు ప్రారంభమయ్యాయి. కానీ కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఎక్కడ పెట్టాలన్నదే ఇప్పుడు పెద్ద ప్రశ్న. ఎందుకంటే.. గత ఏడాది యాసంగి, మొన్నటి వానకాలం సీజన్ ధాన్యం మొత్తం మిల్లుల్లోనే పేరుకుపోవటంతో మిల్లులన్నీ ధాన్యంతో నిండిపోయాయి. దీంతో ఈ యాసంగి ధాన్యం నిల్వ చేసే పరిస్థితి లేకుండాపోయింది. దీనికి పౌరసరఫరాల సంస్థ, మిల్లర్ల నిర్లక్ష్యమే కారణమన్న విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ఓవైపు మిల్లర్లు సీఎంఆర్ ఇవ్వడంలో నిర్లక్ష్యం వహించగా, మరోవైపు టెండర్లలో విక్రయించిన గత యాసంగి ధాన్యాన్ని ఆయా సంస్థలు ఎత్తడం లేదు. ఈ నేపథ్యంలో ఈ యాసంగి ధాన్యాన్ని దించుకునేందుకు మిల్లర్లు ససేమిరా అంటున్నారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే ధాన్యం కొనుగోళ్లపై తీవ్ర ప్రభావం పడే ప్రమాదం ఉన్నది.

మిల్లుల్లో మూలుగుతున్న 80 లక్షల టన్నుల ధాన్యం

రాష్ట్రవ్యాప్తంగా ఉన్న మిల్లుల్లో 80 లక్షల టన్నులకు పైగా ధాన్యం నిల్వ ఉన్నట్టు సమాచారం. ఇక ఈ యాసంగి సీజన్‌లో సుమారు 75 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలుకు పౌరసరఫరాల సంస్థ ప్రణాళికలు రూపొందించింది. అంటే మిల్లుల్లో మొత్తంగా 1.55 కోట్ల టన్నుల ధాన్యం నిల్వ చేయాల్సి వస్తుంది. అవసరమైన వసతులు లేనందున ఈ స్థాయిలో నిల్వ సాధ్యం కాదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. 2022-23 యాసంగికి సంబంధించి 38 లక్షల టన్నుల ధాన్యం, 2023-24 వానకాలం సీజన్ ధాన్యం 43 లక్షల టన్నులు మిల్లుల్లోనే ఉన్నాయి.

ఏడాదైనా సీఎమ్మార్ ఇవ్వలేదు

2022-23 యాసంగికి సంబంధించి 66.84 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు చేయగా, ఇందులో 35 లక్షల టన్నుల ధాన్యాన్ని వేలం ద్వారా విక్రయించారు. మిగిలిన 32 లక్షల టన్నుల ధాన్యానికి సంబంధించి సుమారు 22 లక్షల టన్నుల సీఎమ్మార్(బియ్యం) ఇవ్వాల్సి ఉండగా, ఇందులో 19 లక్షల టన్నులు మాత్రమే అందజేశారు. ఇంకా 3 లక్షల టన్నుల సీఎమ్మార్ బకాయిలు ఉన్నాయి. 3 లక్షల టన్నుల బియ్యానికి సంబంధించి, 4.5 లక్షల టన్నుల ధాన్యం ఇంకా మిల్లుల్లోనే ఉన్నది. ఇక, మొన్నటి వానకాలానికి సంబంధించి ప్రభుత్వం 47.33 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు చేసింది. ఇందుకు 32 లక్షల టన్నుల సీఎమ్మార్(బియ్యం) ఎఫ్‌సీఐకి ఇవ్వాల్సి ఉంటుంది. వానకాలం సీఎమ్మార్ ప్రారంభమై ఐదు నెలలు పూర్తవుతున్నా, 3 లక్షల టన్నుల సీఎమ్మార్ మాత్రమే ఇవ్వడం గమనార్హం. అంటే ఇంకా 29 లక్షల టన్నుల బియ్యం ఇవ్వాల్సి ఉన్నది. ఇందుకు సంబంధించిన 43 లక్షల టన్నుల ధాన్యం మిల్లుల్లోనే ఉన్నది.

టెండర్ల ధాన్యం ఎత్తడం లేదు

వేలంలో ధాన్యాన్ని దక్కించుకున్న సంస్థలు మిల్లుల నుంచి ఎత్తటంలో నిర్లక్ష్యం వహిస్తున్నాయనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. నిబంధనల ప్రకారం వారికి కన్ఫర్మేషన్ లెటర్ ఇచ్చిన 90 రోజుల్లో ధాన్యం మొత్తం ఎత్తేయాలి. ఇప్పటికి 50 రోజులు పూర్తయినా 5-10 వేల టన్నుల ధాన్యాన్ని మాత్రమే ఎత్తినట్టు తెలిసింది. దీంతో కొత్త ధాన్యం పెట్టేందుకు స్థలం సరిపోని పరిస్థితి ఏర్పడింది. ఇప్పటి వరకు సగం ధాన్యం ఎత్తినా పరిస్థితి మరోలా ఉండేదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. మిల్లుల్లో చోటులేదని తెలిసినా, కొత్త ధాన్యం పెట్టేందుకు ఇబ్బందులు ఎదురవుతాయని తెలిసినా.. ధాన్యం ఎత్తేందుకు 90 రోజుల గడువు ఇవ్వటం ఏమిటని పౌరసరఫరాల సంస్థపై విమర్శలు వస్తున్నాయి. గతంలో మాదిరి 45 రోజుల గడువు ఇస్తే ఇప్పటికే ధాన్యం ఎత్తేవారని, ఇప్పుడు ఈ ఇబ్బంది వచ్చేది కాదని అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.

మేం ధాన్యం దించుకోం: మిల్లర్లు

ఈ యాసంగిలో కొన్న ధాన్యాన్ని దించుకొనేందుకు మిల్లర్లు నిరాకరిస్తున్నారు. ఇప్పటికే తమ మిల్లుల్లో ధాన్యం పేరుకుపోయిందని, కొత్త ధాన్యం పెట్టేందుకు స్థలం లేదని తెగేసి చెప్తున్నారు. ఈ మేరకు మిల్లర్లు పలు జిల్లాల్లో కలెక్టర్లకు లేఖలు కూడా రాశారు. దీంతో ధాన్యం ఖాళీ చేయించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్లు పౌరసరఫరాల శాఖకు లేఖలు రాసినట్టు తెలిసింది. ఇటీవల నిర్వహించిన సమీక్షలోనూ జిల్లాల జాయింట్ కలెక్టర్లు ఈ అంశాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకొచ్చినట్టు సమాచారం. ఒకవేళ మిల్లర్లు ధాన్యం దించుకోని పక్షంలో కొనుగోళ్లపై తీవ్ర ప్రభావం పడుతుంది. ధాన్యం కొనుగోళ్లు నిలిచిపోయి రైతులు ఇబ్బంది పడాల్సి వస్తుంది. సమస్యను ప్రభుత్వం వీలైనంత త్వరగా పరిష్కరించాలని రైతులు కోరుతున్నారు.

మరో ఇద్దరు రైతుల ఆత్మహత్య

- ఓవైపు ఎండిన పంటలు.. మరోవైపు అప్పుల భారం
- ఉమ్మడి మెదక్ జిల్లాలో అన్నదాతల బలవన్మరణాలు
- రైతుల కుటుంబాల్లో విషాదాలు

మోటి మల్లయ్య, పల్లపు బాలయ్య (ఫైల్)

మిరుదొడ్డి (అక్బర్‌పేట-భూంపల్లి)/చేగుంట, ఏప్రిల్ 14 : పంటలు చేతికి రాక.. అప్పులు తీర్చలేక మనోవేదనకు గురై.. ఉమ్మడి మెదక్ జిల్లాలో మరో ఇద్దరు రైతులు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నారు. బాధిత కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సిద్దిపేట జిల్లా అక్బర్‌పేట-భూంపల్లి మండలం మోతె గ్రామానికి చెందిన మోటి మల్లయ్య (48) వ్యవసాయంతోపాటు కూలి పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. మల్లయ్య తనకున్న ఎకరం 20 గుంటల భూమిలో వరి సాగుచేశాడు. పంటకు సాగునీరు అందించి కాపాడుకోవాలనే ఉద్దేశంతో అప్పులు చేసి వ్యవసాయ భూమిలో ఇటీవల రెండు బోర్లు వేశాడు. రెండు బోరు బావుల్లో చుక్క నీరు పడలేదు. గతంలో ఉన్న రూ.8 లక్షల అప్పుకు తోడు ఇటీవల వేసిన రెండు బోరు బావుల కారణంగా అప్పులు ఎక్కువయ్యాయి. దీంతో మల్లయ్య మనస్తాపానికి గురయ్యాడు. అప్పులు ఎలా తీర్చాలని మదనపడుతున్న ఆయన ఆదివారం తన ఇంటి వద్ద ఉన్న చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి భార్య కళవ్వ, కుమారుడు మహేశ్ ఉన్నారు. మృతుడి కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకోవాలని గ్రామ మాజీ సర్పంచ్ కాలేరు శ్రీనివాస్ ప్రభుత్వాన్ని కోరారు.

చేగుంట మండలం రెడ్డిపల్లి కాలనీలో..

సిద్దిపేట జిల్లా వర్గల్ మండలం జబ్బాపూర్ గ్రామానికి చెందిన పల్లపు బాలయ్య (37) పదేండ్ల క్రితం మెదక్ జిల్లా చేగుంట మండలంలోని రెడ్డిపల్లి కాలనీకి చెందిన ఉప్పు మమతతో వివాహమైంది. అప్పటి నుంచి రెడ్డిపల్లి కాలనీలోనే నివాసం ఉంటున్నారు. జబ్బాపూర్‌లో బాలయ్య తండ్రి పేరు మీద ఎకరం పట్టా, ఎకరన్నరం లావణి పట్టా భూమి ఉన్నది. బాలయ్య తండ్రికి ముగ్గురు కొడుకులు కాగా అన్నదమ్ములు ఇటీవలే పంచుకొని వ్యవసాయం చేసుకుంటున్నారు. బాలయ్య రెడ్డిపల్లి కాలనీలో కూడా కొంత భూమిని కౌలుకు తీసుకొని వ్యవసాయం చేస్తున్నాడు. ఓ ట్రాక్టర్ కొనుగోలు చేసి నడుపుకొంటున్నాడు. వ్యవసాయానికి, ట్రాక్టర్‌కు చేసిన అప్పులు ఎక్కువ కావడంతో, కొంత కాలంగా మానసిక వేదనకు గురవుతున్నాడు. ఈ క్రమంలో శనివారం రాత్రి ఆయన కాలనీ సమీపంలోని ఓ చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. బాలయ్యకు భార్య, ముగ్గురు కూతుర్లు ఉన్నారు. భార్య మమత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు చేగుంట ఎస్సై బాల్‌రాజ్ తెలిపారు.

ఎండిన పంటలను గొడ్లు మేస్తున్నయి

- కాంగ్రెసోళ్లు నాశనం చేసిన్రు
- మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డితో ఓ గిరిజన రైతు మనోగతం

సూర్యాపేట జిల్లా ఆత్మకూర్.ఎస్ మండలం బొప్పారం తండా వద్ద గిరిజన రైతు రాములుతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి

సూర్యాపేట, ఏప్రిల్ 14 (నమస్తే తెలంగాణ): 'నీళ్లు లేవు.. కరెంటు వస్తలేదు.. యాడికాడ ఎండిన పంటలను గొడ్లు మేస్తున్నయి. కాంగ్రెసోళ్లు పంటలను నాశనం చేసిన్రు.జనం ప్రభుత్వంపై అడ్డమైన కూతలు కూస్తున్నరు' అంటూ గిరిజన రైతు రాములు మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డితో చెప్పుకొచ్చాడు. ఆదివారం సూర్యాపేట నుంచి ఆత్మకూర్.ఎస్ మండల కేంద్రానికి వెళ్తున్న సందర్భంలో బొప్పారం తండా వద్ద రోడ్డు పక్కన ఉన్న రాములు అనే రైతు జగదీశ్‌రెడ్డి కారును ఆపాడు. 'ఏం సంగతి అంతా బాగున్నారా? కాలం, కరెంటు పరిస్థితి ఏంది? అని జగదీశ్‌రెడ్డి ఆరా తీయగా.. ఆ రైతు కాంగ్రెస్ ప్రభుత్వంపై ఆక్రోశాన్ని వెల్లగక్కాడు. 'మొన్న కాంగ్రెస్‌కు ఓటేశారు కదా? మరి పార్లమెంట్ ఎన్నికల్లో మీ తండాల్లో మార్పు వచ్చిందా?' అని జగదీశ్‌రెడ్డి అడిగితే.. 'వాస్తవమే అయ్యా.. ఇయ్యాల జనం ఎవరెక్కడ పోరు.ఈ సారి మన ఓట్లు యాడికి పోవు..ఎవ్వలు చెప్పకున్నా మనసుకు అప్పుడే వచ్చింది' అని రైతు రాములు చెప్పాడు. ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి స్పందిస్తూ ధైర్యంగా ఉండాలని సూచిస్తూ ముందుకు కదిలారు.

తెల్వక కయ్యాల వడ్డం

మొదటిపేజీ తరువాయి...

రోజులైతున్నదని, కేంద్రాన్ని ప్రారంభించి వెళ్లిన అధికారులు వడ్లు జోకుతలేరని రైతు కనుకయ్య వినోద్‌కుమార్‌తో తన గోడును వెల్లబోసుకున్నారు. 'అకాల వర్షాలు పడితే అసలుకే మోసం వస్తుంది. రైతుబంధు ఇయ్యలేదని, రూ.500 బోనస్ ఇచ్చుడు ఏమో గానీ, మద్దతు ధరకు వడ్లు కొంటరో లేదో అని రందివట్టుకుంది' అని వాపోయాడు. ఈ సందర్భంగా వినోద్‌కుమార్ మాట్లాడుతూ వరికోతలు ప్రారంభమై కొనుగోలు కేంద్రానికి ధాన్యం చేరినా ప్రభుత్వం కేంద్రాలను ప్రారంభించడంలో నిర్లక్ష్యం చేస్తుందని మండిపడ్డారు. క్వింటాల్‌కు రూ.500 బోనస్ ఇవ్వాల్సి వస్తుందనే కారణంతో ప్రభుత్వం ధాన్యం కొనుగోళ్లు చేపట్టడం లేదని విమర్శించారు. గ్రామాల్లో రైతులు వరిధాన్యం తీసుకొచ్చి కొనుగోలు కేంద్రాల్లో కుప్పలు పోస్తున్నారని, ఎప్పుడు కొంటారో తెలియక క్వింటాల్‌కు రూ.1,800 చొప్పున దళారులకు అమ్ముకుంటున్నారని తెలిపారు. ప్రభుత్వానికి రైతుల పట్ల ప్రేమ ఉంటే ఇప్పటి వరకు ధాన్యం తరలించడానికి మిల్లులు ఎందుకు కేటాయించలేదని ప్రశ్నించారు. ధాన్యం కొనుగోళ్లు ఆలస్యం కావడంతో విధిలేని పరిస్థితుల్లో దళారులకు అమ్ముకుని నష్టపోతున్నారని తెలిపారు. వెంటనే కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి రైతులు నష్టపోకుండా చూడాలని డిమాండ్ చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కనీస మద్దతు ధరతోపాటు క్వింటాల్‌కు రూ.500 బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేశారు.

పంటలు దూరమై..అప్పులు భారమై..!

- పాలం వద్దనే రైతు బలవన్మరణం
- పుట్టెడు దుఃఖంలో కూలి పనులకు అన్నదాత భార్య
- అందని సర్కారు ఆర్థిక సాయం
- ఆదుకోవాలని కుటుంబీకుల విజ్ఞప్తి

సుధాకర్ ఫొటోతో ఆయన భార్య, పిల్లలు. (ఇన్‌సెట్‌లో) రైతు పిట్టల సుధాకర్ (ఫైల్)

వరంగల్, ఏప్రిల్ 14 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): వారికి వ్యవసాయమే జీవనాధారం. మూడెకరాలు భూమి.. ఓ బావి ఉంది. బీఆర్ఎస్ ప్రభుత్వం ఉన్నప్పుడు ప్రాజెక్టుల నుంచి పంటలకు క్రమం తప్పకుండా నీటిని విడుదల చేసేది. ప్రాజెక్టుల నీరు విడుదల చేసినప్పుడల్లా బావిలో పుష్కలంగా నీళ్లచ్చేవి. ఆ నీటి వసతితో మూడెకరాల్లో మూడు పువ్వులు.. ఆరు కాయలుగా పంటలు పండేంది. పదేండ్లుగా వచ్చిన పంట దిగుబడితో భార్య, ఇద్దరు పిల్లలు ఉన్న కుటుంబానికి పొట్ట తిప్పలు ఉండకపోయేది. కానీ కాలం ఎప్పుడూ ఒకేలా ఉండదు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చింది. ఆ రైతుకు కష్టాలు ప్రారంభమయ్యాయి. ఎప్పటిలాగే వస్తాయనుకున్న ప్రాజెక్టుల్లోని నీరు ఈ సారి రాలేదు. బావిలో కూడా నీళ్లు కూడా అడుగంటిపోయాయి. పంటలకు నీళ్లందక ఎండిపోతుంటే రైతు కండ్లల్లో నీళ్లు తిరిగాయి. దిగుబడి సంగతి దేవుడెరుగు పెట్టుబడి కూడా కరువవడంతో పంట చేసులోనే పురుగుల మందు తాగాడు. కుటుంబానికి పెద్ద దిక్కుగా ఉండాల్సిన రైతు కానరానిలోకానికి వెళ్లిపోయాడు. పుట్టెడు దుఖంలో ఉన్న ఆ కుటుంబం ఇప్పుడు పొట్ట తిప్పల కోసం కూలీ పనికి వెళ్తున్నది.

హనుమకొండ జిల్లా వేలేరు మండలం పీచర గ్రామానికి చెందిన రైతు పిట్టల సుధాకర్ (43)కు మూడు ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. అందులో గతంలో తవ్విన బావితో నీటి వసతి ఉన్నది. ఆ నీటితో వరి, మొక్కజొన్న పంటలు పండించేవాడు. కేసీఆర్ పాలనలో ప్రాజెక్టుల నుంచి వచ్చిన సాగు నీటితో పదేండ్లుగా భూగర్భ జలాలు పుష్కలంగా ఉండేవి. పంటల సాగుకు నీళ్ల ఇబ్బందులు లేకుండా ఉండేది. ఇదే ధీమాతో సుధాకర్ రెండేండ్ల క్రితం అప్పులు తెచ్చి కూతురు రవళి పెళ్లి చేశాడు. తెచ్చిన అప్పును ప్రతి పంటకు కొంత లెక్కన తీర్చవచ్చని అనుకున్నాడు. తానొకటి తలిస్తే దైవమొకటి తలిచిందన్నట్టు ఈ యాసంగిలో ఎప్పటిలాగే ఎకరంలో వరి, రెండు ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేశాడు. బావిలో మొదట్లో పంటలకు సరిపడా నీళ్లు ఉండేవి. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత ప్రాజెక్టుల నుంచి సాగునీటి సరఫరా నిర్వహణ సరిగా చేయలేదు. దీంతో ఫిబ్రవరి మధ్య నుంచి బావిలో నీళ్లు పూర్తిగా అయిపోవడం మొదలైంది. ఆందోళన చెందిన సుధాకర్ మరింత మొత్తం అప్పుగా తెచ్చి వ్యవసాయ బావిలో రెండు సైడ్ బోర్లు వేయించాడు. ఆ రెండు సైడ్ బోర్లు ఫెయిల్ అయ్యాయి. కూతురు పెళ్లి కోసం తెచ్చినవి, బోర్ల కోసం తెచ్చిన అప్పులు కలిపి రూ.15 లక్షలు దాటింది. పేరుకుపోయిన అప్పులను తలుచుకుని సుధాకర్ పూర్తిగా కుంగిపోయాడు. కండ్ల ముందే ఎండుతున్న పంటలను చూసి ఆత్మస్థైర్యం కోల్పోయాడు. పంట చేన్లలోనే మార్చి 18న పురుగుల మందు తాగి బలవన్మరణం చెందాడు. దీంతో భార్య విజయ, 9వ తరగతి చదువుతున్న కుమారుడు రాహుల్ రోడ్డున పడాల్సిన పరిస్థితి వచ్చింది.

పట్టించుకునే వారేరీ ?

పుట్టెడు దుఃఖంలో ఉన్న సుధాకర్ కుటుంబాన్ని మంత్రులు, నాయకులు ఎవరూ పట్టించుకోలేదు. ఇంటి పెద్ద దిక్కును కోల్పోయినా పొట్ట తిప్పలు కోసం సుధాకర్ భార్య విజయ కూలి పనులకు వెళ్తున్నది. వ్యవసాయ భూమి ఉన్నా బావిలో నీళ్లు లేకపోవడంతో పంటలు వేసుకునే పరిస్థితి లేకుండాపోయింది. ప్రభుత్వపరంగా ప్రాజెక్టుల నుంచి నీటి సరఫరా చేసే పరిస్థితి లేదు. గ్రామపంచాయతీలో తలెత్తిన సాంకేతిక సమస్య వల్ల ఇప్పటి వరకు సుధాకర్ డెత్ సర్టిఫికెట్ జారీ కాలేదు. ఈ సర్టిఫికెట్ ఎప్పటి వరకు జారీ అవుతుందో చెప్పలేని పరిస్థితి ఉన్నది. అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ తీసుకుని డెత్ సర్టిఫికెట్‌తో పాటు రైతు బీమా దరఖాస్తు చేయిస్తే.. ఆ పైసలు తమకు కొంతవరకైనా ఆసరా అవుతాయని సుధాకర్ భార్య విజయ వాపోయింది. ప్రభుత్వం తమ కుటుంబాన్ని ఆదుకోవాలని ఆమె విజ్ఞప్తి చేస్తున్నది.

దేశవ్యాప్తంగా కాంగ్రెస్‌కు 30 సీట్లు దాటవు

- బీజేపీ ఎంపీ ధర్మపురి అర్వింద్

హైదరాబాద్, ఏప్రిల్ 14 (నమస్తే తెలంగాణ) : కాంగ్రెస్‌కు దేశవ్యాప్తంగా మొత్తం 30 సీట్లు కూడా దాటవని బీజేపీ ఎంపీ ధర్మపురి అర్వింద్ అన్నారు. కాంగ్రెస్ పార్టీ దిగజారుడు రాజకీయాల వల్ల ఆ పార్టీకి లోక్‌సభ ఎన్నికల్లో అభ్యర్థులు కూడా దొరకడం లేదని ఎద్దేవా చేశారు. ఆదివారం ఆయన బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి నాలుగు నెలలు దాటిందని, ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలపై ఇప్పటివరకు స్పష్టత లేదని మండిపడ్డారు. డిసెంబర్ 9 తర్వాత వడ్లకు రూ.500 బోనస్ ఇచ్చి కొంటామని రేవంత్ రెడ్డి చెప్పారని, 'డిసెంబర్ 9 ఇంకా రాలేదా?' అని ప్రశ్నించారు. రూ.2 లక్షల రుణమాఫీ ఎవరూ అడగకున్నా హామీ ఇచ్చి మోసం చేశారని విమర్శించారు. రైతు బంధును ఖమ్మం మంత్రులు ఎత్తుకుపోయారని, రేవంత్ రెడ్డి బీజేపీలోకి వస్తే ఆహ్వానిస్తానని చెప్పారు.

జనగామ జిల్లా దేవరుప్పులలో గొడవకు దిగిన పెద్ది కృష్ణమూర్తి వర్గం

దేవరుప్పలలో చేరికల పోరు

- ఝాన్సీరెడ్డి, పెద్ది కృష్ణమూర్తి వర్గీయుల గొడవ
- పోలీసుల జోక్యంతో శాంతించిన ఇరువర్గాలు

దేవరుప్పుల, ఏప్రిల్ 14: పాలకుర్తి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి హనుమాండ్ల ఝాన్సీరెడి ఆధ్వర్యంలో దేవరుప్పుల, కామారెడ్డిగూడెం, గొల్లపల్లి, ధర్మాపురం, ధర్మగడ్డ తండాల్లోని బీఆర్ఎస్ కార్యకర్తలు ఆదివారం జనగామ జిల్లా దేవరుప్పుల మండల కేంద్రంలో కాంగ్రెస్ కండువాలు కప్పుకున్నారు. అదే సమయంలో కాంగ్రెస్ పార్టీ మండల మాజీ అధ్యక్షుడు పెద్ది కృష్ణమూర్తి వర్గానికి చెందిన 30 మంది కాంగ్రెస్ నాయకులు తమను సమావేశానికి ఎందుకు పిలువలేదని, తమను సంప్రదించకుండా తమ గ్రామాల్లో ఉన్న బీఆర్ఎస్ శ్రేణులను ఎలా కాంగ్రెస్‌లో చేర్చుకుంటారని స్టేజీపై ఉన్న నాయకులను నిలదీశారు. దీంతో ఝాన్సీరెడ్డి, పెద్ది కృష్ణమూర్తి వర్గాల మధ్య చేరికల గొడవ తలెత్తి ఘర్షణ వాతావరణం నెలకొన్నది. పోలీసులు జోక్యం చేసుకుని పెద్ది వర్గానికి సంబంధించిన నాయకులను బయటకు పంపించారు. పలువురిని పోలీస్‌స్టేషన్‌కు తరలించడంతో గొడవ సద్దుమణిగింది.

ఎమ్మెల్యే రేవూరి వర్సెస్ మంత్రి కొండా

- జై కొండా అంటూ నినాదాలు.. ఇరువర్గాల తోపులాట
- రసాభాసగా పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశం

హనుమకొండ జిల్లా పరకాలలో తోపులాడుకుంటున్న కాంగ్రెస్ శ్రేణులు

పరకాల, ఏప్రిల్ 14: మంత్రి కొండా సురేఖ వద్దకు వెళ్లే కాంగ్రెస్ శ్రేణులు తన వద్దకు రావొద్దని పార్లమెంట్ ఎన్నికల ఇన్‌చార్జి, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి వ్యాఖ్యలపై కొండా అనుచరులు నిరసన తెలిపారు. పార్టీలో తమకు సరైన ప్రాధాన్యం ఇవ్వడం లేదని, కనీసం సమావేశాల సమాచారం కూడా లేదని వాపోయారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో హనుమకొండ జిల్లా పరకాలలో రేవూరి ప్రకాశ్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం కాంగ్రెస్ నియోజకవర్గ స్థాయి సమావేశం నిర్వహించారు. పాలకుర్తి, వరంగల్ పశ్చిమ, భూపాలపల్లి, స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యేలు యశస్విని రెడ్డి, నాయిని రాజేందర్‌రెడ్డి, గండ్ర సత్యనారాయణరావు, కడియం శ్రీహరి, కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామ్‌రెడ్డి, ఎంపీ అభ్యర్థి కడియం కావ్య హాజరయ్యారు. సమావేశం జరుగుతుండగా కొండా వద్దకు వెళ్లే పార్టీ శ్రేణులు తన వద్దకు రావొద్దంటూ రేవూరి వ్యాఖ్యలు చేయడంతో.. కొండా వర్గీయులు 'జై కొండా, జిల్లా టైగర్ కొండా మురళి' అంటూ సభా వేదిక మీదకు దూసుకెళ్లే ప్రయత్నం చేయగా మరో వర్గం శ్రేణులు అడ్డుకున్నాయి. దీంతో ఇరువర్గాల మధ్య తోపులాట జరగడంతో కొద్దిసేపు ఉద్రిక్తత నెలకొంది. జై కొండా అంటూ నినాదాలు చేసిన గజ్జి విష్ణును పోలీసులు అదుపులోకి తీసుకు